

ఉపాధి ప్రశ్నార్థకం
చేతినిండా పని లేక బీడీ కార్మికులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. నెలలో పదిహేను రోజులకు మించి పని ఉండడం లేదు. ప్రత్యామ్నాయమూ లేక అవసోపాలు పడుతున్నారు. 8లో▸



మస్తు పిరమైనయ్..
జిల్లాలో కూరగాయల ధరలు విపరీతంగా మండిపోతున్నాయి. అన్ని రకాల కూరగాయల ధరలు కిలోకు కనిష్టంగా రూ.10 నుంచి గరిష్టంగా రూ.35వరకు పెరిగాయి. 9లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
37.0 /28.0
ఉదయం, రాత్రి వేళల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉత్తరం దిశగా ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

అరగంట ముందే గేట్లు బంద్

- నేడు గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష
- ఉదయం 10గంటల వరకే కేంద్రంలోకి అనుమతి
- పరీక్షకు నిబంధనలు కఠినతరం



గ్రూప్–1 పరీక్ష నిర్వహణపై మంచిర్యాలలో ఇన్విజిలేటర్ల సమావేశం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష జిల్లాలో పకడ్బందీగా నిర్వహించేందుకు జిల్లా అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఇప్పటికే రెండుసార్లు ఈ పరీక్ష నిర్వహించగా.. ఇది మూడోసారి కావడం గమనార్హం. మొదటిసారి పరీక్ష రద్దు, రెండోసారి పేపర్ లీకేజీతో అభ్యర్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వస్తోంది. దీంతో రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కఠిన నిబంధనలు అమలు చేస్తోంది. ఎక్కడా అవాంఛనీయ ఘటనలకు ఆస్కారం ఇవ్వకుండా పోలీసు అధికారుల సమక్షంలో పటిష్టంగా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో గత అక్టోబర్ 16న నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్షకు జిల్లా నుంచి 9,243 మంది అభ్యర్థులు స్థానికంగా పరీక్ష కేంద్రాలు ఎంపిక చేసుకున్నారు. వీరిలో 7,259మంది పరీక్ష రాశారు. తాజాగా నిర్వహిస్తున్న ప్రిలిమినరీ పరీక్షకు జిల్లాలో 27 పరీక్ష కేంద్రాల్లో 9,384మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం మంచిర్యాల, మందమర్రి, బెల్లంపల్లి, నస్పూర్ పరిధిలోని పలు చోట్ల ఉన్న పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది. కఠిన నిబంధనలతో అభ్యర్థులకు మరింత ఇబ్బందులేనని వాపోతున్నారు.

కఠినంగా నిబంధనలు

గతంలో మాదిరి కాకుండా ఈసారి మరింత కఠినంగా గ్రూప్–1 పరీక్ష నిర్వహణకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాట్లు చేసింది. ఈ మేరకు జిల్లాలోనూ పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయనున్నారు. అర గంట ముందే పరీక్ష కేంద్రాలను మూసి వేయనున్నారు. అంటే పరీక్ష ఉదయం 10.30గంటలకు ప్రారంభమైతే అభ్యర్థులను పది గంటల వరకే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ఉదయం 9గంటల నుంచి 10గంటల వరకు గంట వ్యవధిలోనే అభ్యర్థులను లోనికి అనుమతి ఇస్తారు. పరీక్ష రాసే ముందు ప్రతీ ఒక్కరికి ఇన్విజిలేటర్‌తోపాటు అభ్యర్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ ఉంటుంది. చేతి వాచ్‌తోపాటు ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. ఏదైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంబంధిత గుర్తింపు కార్డు(పాస్‌పోర్ట్, పాన్‌కార్డు, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, ప్రభుత్వ ఉద్యోగి గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఇతరత్రా) తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుంది. హాల్‌టికెట్‌పై మూడు నెలలోపు తీసుకున్న తాజా పాస్‌పోర్టు సైజ్ ఫొటో అతికించాలి. ఒకవేళ హాల్‌టికెట్‌పై ఫొటో సరిగా లేకపోతే ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం చేయించాలి. హాల్‌టికెట్‌పై పేర్కొన్న నియమ నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఏమాత్రం ప్రవర్తన నియమావళి పాటించకున్నా కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రతీ 500 మంది అభ్యర్థులకు ఒక అధికారి, జిల్లాకు ఓ ఇన్‌చార్జిని పర్యవేక్షణకు నియమించారు. జిల్లా కలెక్టర్ సంతోష్‌తోపాటు పోలీసు అధికారులు పరీక్ష కేంద్రాలను పరిశీలించనున్నారు. పరీక్ష పూర్తయ్యాక బందోబస్తు మధ్య ఓఎంఆర్ షీట్లను హైదరాబాద్‌కు తరలించే వరకు గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉదయం పదింటిలోగా చేరుకోవాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్



కలెక్టర్ బి.సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహిస్తామని కలెక్టర్ బి.సంతోష్ తెలిపారు. అభ్యర్థులు ఉదయం పదింటిలోగా పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని, 10గంటల తర్వాత లోనికి అనుమతించబోమని స్పష్టం చేశారు. బయోమెట్రిక్ అటెండెన్స్ ఇవ్వకుండా పరీక్ష కేంద్రం నుంచి బయటకు వెళ్తే ఆ అభ్యర్థి ఓఎంఆర్ షీట్ పరిగణనలోకి తీసుకోబోమని, అభ్యర్థుల చేతివేళ్లపై మెహందీ, టాటూస్ ఉండకూడదని తెలిపారు. బూట్లు వేసుకోవద్దని, మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకురావొద్దని, బ్లూ/బ్లాక్ బాల్‌పాయింట్ పెన్ను, గుర్తింపు కార్డు తీసుకు రావాలని సూచించారు. అభ్యర్థుల సందేహాల నివృత్తి, సహాయం కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ 08736–250500 ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

రేపు వానాకాలం సాగుపై ఫోన్ ఇన్



జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ

మంచిర్యాలఅగ్రికల్చర్: వానాకాలం సీజన్ ప్రారంభమైంది. రుతు పవనాలు రాష్ట్రంలోకి ప్రవేశించాయి. రైతులు ఇప్పటికే పొలాలు సిద్ధం చేసుకుని విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. సాగు సలహాలు, సూచనలపై 'సాక్షి' ఆధ్వర్యంలో సోమవారం ఫోన్ ఇన్ నిర్వహించనుంది. పంటలు వేసే సమయం, విత్తనాలు, ఎరువులు, వాతావరణ పరిస్థితులు, ఏయే పంటలు సాగు చేయాలి తదితర అంశాలపై రైతుల సందేహాలను జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ నివృత్తి చేస్తారు.

రైతులు సంప్రదించాల్సిన నంబరు
72888 94008
సమయం: సోమవారం ఉదయం 11గంటల నుంచి 12గంటల వరకు

న్యూస్‌రీల్

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

- ప్రొఫెసర్ కోదండరాం



బడిబాటలో పాల్గొన్న కోదండరాం

నెన్నెల: ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతోందని, బడీడు పిల్లలను బడిలో చేర్పించాలని ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం బడిబాట కార్యక్రమంలో భాగంగా తన స్వగ్రామమైన జోగాపూర్‌లో పాల్గొని మాట్లాడారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సకల సౌకర్యాలు ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తెలిపారు. ప్రభుత్వం కార్పొరేట్‌కు దీటుగా బడులను అన్ని విధాలుగా తీర్చిదిద్దుతోందని అన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో విద్యాబోధన ఉంటుందని, ఎలాంటి ఫీజులు లేకుండా ఉచిత భోజనం, దుస్తువులు, పాఠ్యపుస్తకాలు ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. నెన్నెల మండల కేంద్రంలో జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని నెన్నెల హైస్కూల్ హెచ్‌ఎం ప్రకాష్‌రావు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించిన కోదండరాం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి కళాశాల ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జోగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం చక్రవర్తి, నెన్నెల హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

293మంది స్కూల్ అసిస్టెంట్ల రిలీవ్

మంచిర్యాలఅర్బన్: జిల్లాలో 293మంది స్కూల్ అసిస్టెంట్లు రిలీవ్ అయ్యారు. శనివారం బదిలీ ఆర్డర్ ఉత్తర్వులతో కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేశారు. ఇదివరకు బదిలీలు కాగా సాంకేతిక లోపంతో ఉత్తర్వులు అందక పాత పాఠశాలల్లోనే విధులు నిర్వర్తిస్తున్నారు. స్కూల్ అసిస్టెంట్ బదిలీల ఉత్తర్వులపై ఎడతెగని జాప్యం ఏర్పడింది. ఎన్నికల కోడ్ ముగియడం .. ఈ నెల 12న పాఠశాలలు ప్రారంభం కానున్నాయి. ఇంకోవైపు శనివారం నుంచి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో బదిలీ ఉత్తర్వుల కోసం ఎదురుచూస్తున్న ఎస్‌ఏలకు రిలీవ్ దొరకడంతో కొత్త పాఠశాల బాట పట్టారు. 293 మంది కొత్త పాఠశాలల్లో రిపోర్టు చేశారని డీఈవో యాదయ్య తెలిపారు.

బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు ఆశయ్య

పాతమంచిర్యాల: కామారెడ్డిలో బీసీ డిక్లరేషన్ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రజక వృత్తిదారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, ప్రతీ రజక వృత్తిదారునికి రూ.10లక్షలు ఆర్థిక సాయం అందజేయాలని తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పైళ్ల ఆశయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీసీ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు ప్రత్యేక జీవో ద్వారా అమలు చేయాలన్నారు. జిల్లాకు రూ.10 కోట్లతో మోడ్రన్ దోబీఘాట్ నిర్మాణం చేస్తామన్నారని గుర్తు చేశారు. ఉచిత విద్యుత్ పథకాన్ని ఎల్‌టీ 4లో చేర్చాలని, ఇందిరమ్మ ఇళ్లు, బీమా పథకాలు వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ముష్కర చందు, తరిగొప్పుల భాగ్య, దుర్శెట్టి రాములు, నడిగోటి తిరుపతి, జిల్లా కార్యదర్శి పాయిరాల రాములు పాల్గొన్నారు.

లాభాల్లో 35శాతం వాటా చెల్లించాలి



సీఎండీకి జనక్‌ప్రసాద్ వినతిపత్రం

శ్రీరాంపూర్: గత ఆర్థిక సంవత్సరం కంపెనీ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటా కార్మికులకు చెల్లించాలని ఐఎన్టీయూసీ సెక్రెటరీ జనరల్ బీ.జనక్‌ప్రసాద్ తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఎండీ యన్.బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. సంస్థ గత ఆర్థిక సంవత్సరం 70.12 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించి రికార్డు సృష్టించిందని తెలిపారు. సంస్థ రూ.37 వేల కోట్ల లాభాలు గడిచిందని, ఇన్ని కోట్ల లాభాలు గడించడానికి కారణం కార్మికులు కష్టపడి పని చేయడమేనని తెలిపారు.

బస్సుల ఫిట్‌నెస్‌పై నిర్లక్ష్యం!



బస్సులో ప్రథమ చికిత్స కిట్‌ను పరిశీలిస్తున్న ఎంవీఐ కిషోర్‌చంద్రరెడ్డి

- స్పందించని ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యం
- జిల్లాలో 366 స్కూల్‌బస్సులు
- ఈ నెల 12వరకు పరీక్షలకు గడువు

జిల్లా వివరాలు

విద్యాసంస్థల బస్సులు	474
కాలపరిమితి ముగిసినవి	108
మిగిలినవి	366
ఒక్క మంచిర్యాలలోనే బస్సులు	210
ఇప్పటివరకు ఫిట్‌నెస్ అయినవి	134
ఫిట్‌నెస్ కావాల్సినవి	232

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో ప్రైవేటు స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలపై విద్యాసంస్థల యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. ఈ నెల 12నుంచి విద్యాసంవత్సరం ప్రారంభం కానుండగా.. తొందరేమీ లేదన్న ధోరణి కనిపిస్తోంది. ప్రతీ ఏడాది మే నెలలో బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు ప్రారంభమై జూన్ ఒకటి వరకు ముగుస్తాయి. కానీ ఇప్పటికీ చాలా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించకపోవడం నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. బస్సుల ఫిట్‌నెస్ పరీక్షల నిర్వహణకు జిల్లా రవాణా శాఖ సిద్ధంగా ఉంది. జిల్లాలో మొత్తంగా 366 బస్సులు ఉండగా.. ఇప్పటికే ఇప్పటివరకు 134 బస్సుల ఫిట్‌నెస్ పరీక్షలు చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా 232 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయాల్సి ఉంది. ఈ నెల 12లోగా ఫిట్‌నెస్ పరీక్ష చేయించుకుని సర్టిఫికెట్ పొందాలని, లేనిపక్షంలో తనిఖీల్లో బస్సులు సీజ్ చేస్తామని అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాలోని విద్యాసంస్థల బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేస్తుండగా.. రవాణా శాఖ కార్యాలయానికి బస్సులు రావడం లేదు.

ఇవీ నిబంధనలు

- బస్సు మంచి కండీషన్‌లో ఉండేలా చూసుకోవాలి. 15 ఏళ్ల జీవిత కాలం దాటకూడదు. బస్సుకు పసుపు రంగు తప్పక ఉండాలి.
- బస్సు స్టీరింగ్, బ్రేకులు, టైర్లు, ఇండికేటర్లు, వైపర్లు, అత్యవసర ద్వారం, కిటికీలకు గ్రిల్స్ అమర్చడం, పిల్లలు బస్సు ఎక్కేందుకు, దిగేందుకు అనువుగా ఉండాలి.
- ముఖ్యంగా డ్రైవర్ ఆరోగ్యంగా ఉండాలి. నెలకోసారి బీపీ, షుగర్, కంటి పరీక్షలు చేయించాలి. మద్యంతాగి వాహనం నడపకూడదు. డ్రైవర్‌కు లైసెన్స్ విధిగా ఉండాలి.
- ప్రతీ బస్సులో ప్రథమ చికిత్స బాక్సు ఉండాలి. సైడ్ మిర్రర్లు, లైట్లు, బస్సు వెనక ఎరుపు రంగు రేడియం టేపు, ముందు తెలుపు రంగు రేడియం అతికించి ఉండాలి.

ఫిట్‌నెస్ లేకుంటే సీజ్



జూన్ 12 వరకు గడువు ఉన్నా బస్సుల ఫిట్‌నెస్ త్వరగా పూర్తి చేసుకోవాలని విద్యాసంస్థల యాజమాన్యాలకు సూచిస్తున్నాం. ఫిట్‌నెస్ కోసం బస్సులు సమయానికి వస్తే వెంటనే చేసి పంపిస్తాం. అన్ని పాఠశాలల బస్సులు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించుకుని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి పొందాల్సి ఉంటుంది. బస్సులను పక్కాగా పరిశీలించాకే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తాం. నిబంధనలు పాటించని బస్సులు రోడ్లపైకి రావద్దు. ఫిట్‌నెస్ లేని వాహనాలు పట్టుబడితే సీజ్ చేస్తాం.
– సంతోష్‌కుమార్, ఇంచార్జీ డీటీఓ, మంచిర్యాల

అప్పీలు లేని అంతిమ తీర్పు

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు
- జాతీయ లోక్ అదాలత్‌లో 4,462 కేసులు పరిష్కారం



జిల్లా కోర్టులో రాజీ కుదుర్చుతున్న న్యాయమూర్తి

మంచిర్యాలక్రైం: లోక్ అదాలత్‌లో పరిష్కరించిన కేసులు అప్పీలు లేని అంతిమ తీర్పు అని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం జిల్లాలోని వివిధ కోర్టు ప్రాంగణాల్లో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఎన్నో ఏళ్ల నుంచి పెండింగ్‌లో ఉన్న 4,462 కేసులు పరిష్కరించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఏడు బెంచ్‌ల్లో లోక్ అదాలత్ నిర్వహించామని, రాజీ మార్గమే రాజమార్గంగా పరిగణిస్తూ లోక్ అదాలత్‌లో కోర్టు కేసులు పరిష్కరించుకోవాలని సూచించారు. తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ ఆదేశాల మేరకు లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని అన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉండి రాజీ కుదిర్చేందుకు అనుకూలంగా ఉన్న కేసులన్నీ సత్వరమే పరిష్కారం కోసం ఇరువర్గాలు రాజీ కుదుర్చుకోవాలని పేర్కొన్నారు. బ్యాంకు కేసులు 46 పరిష్కరించామని, సైబర్ క్రైమ్ 11 కేసుల్లో రూ.1.30లక్షలు కక్షిదారులకు రికవరీ చేయించామని తెలిపారు. అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా లీగల్ సర్వీస్ కార్యదర్శి అర్పిత మారంరెడ్డి, సంపత్, కే.నిరోషా, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో చేపట్టాలి

- మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు
- వైద్యకళాశాల నిర్మాణ పనుల పర్యవేక్షణ



మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వ వైద్యకళాశాల భవన నిర్మాణ పనులు నాణ్యతతో చేపట్టాలని మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు అన్నారు. హాజీపూర్ మండలం గుడిపేట గ్రామ శివారులో రూ.205కోట్లతో చేపట్టిన ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులను శనివారం ఆయన క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు. రోడ్లు, భవనాల శాఖ అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి ఆయనకు స్వాగతం పలికారు. వైద్య కళాశాల ప్రాంగణంలోని బాల, బాలికల వసతిగృహాలతోపాటు వైద్య కళాశాల భవనాల నిర్మాణాలను పరిశీలించారు. వైద్య కళాశాలలోని రెండు వసతిగృహాల్లో గదుల సంఖ్య, విద్యార్థుల పరిమితి, ల్యాబ్‌లు, తరగతి గదులు, సెమినార్ గదులు, మ్యూజియం, అనాటమీ తదితర విభాగాల నిర్మాణ పనులపై సమీక్షించారు. రోడ్లు, భవనాల శాఖ మంచిర్యాల డీఈ భాష్‌సింగ్, కళాశాల నిర్మాణ పర్యవేక్షణ జేఈ అనూష ఎమ్మెల్యేకు వివరాలు తెలియజేశారు. కళాశాల వచ్చే ఏడాది మార్చిలోగా పూర్తి చేసి అప్పగిస్తామని వివరించారు. దాదాపు 31 ఎకరాల్లో 25 ఎకరాల వరకు వైద్య కళాశాల భవన నిర్మాణ పనులు జరుగుతుండగా భవిష్యత్‌లో వైద్య కళాశాల సిబ్బందికి అవసరమైన క్వార్టర్స్ నిర్మాణం చేపట్టేలా ప్రణాళిక తయారు చేయాలని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు తూముల నరేశ్, తోట రవి, పూస్కూరి శ్రీనివాసరావు, గోనె సతీశ్‌రావు, నాయికిని సురేందర్, రాసమల్ల శ్రీనివాసగౌడ్, ఒడ్డె శ్రీనివాస్, కోటె సత్తయ్య, దొమ్మటి సత్తయ్య, కళాశాల ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ సంపూర్ణరావు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు పేరు తేవాలి



క్రీడాకారులకు మెమొంటోలు అందిస్తున్న కలెక్టర్

మంచిర్యాలటౌన్: అంతర్జాతీయ స్థాయిలో రాణించి జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల పట్టణంలోని గ్రీన్‌సిటీలో ఉన్న మాస్టర్స్ బ్యాడ్మింటన్ అకాడమీలో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీలకు కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని టాస్ వేసి జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి బ్యాడ్మింటన్ ఆడి క్రీడాపోటీలు ప్రారంభించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారికి మంచి భవిష్యత్ ఉంటుందని, క్రీడాకారులకు ప్రోత్సాహాన్ని అందించేలా ఈ పోటీల నిర్వహణ ఉండాలని తెలిపారు. అనంతరం జాతీయ స్థాయిలో మెరుగైన ర్యాంకులు సాధించిన ఎనిమిది మంది క్రీడాకారులు, పాల్గొన్న క్రీడాకారులను మెమొంటోలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, చీఫ్ అడ్వైజర్ గాజుల ముఖేశ్‌గౌడ్, ట్రెజరర్ సత్యపాల్‌రెడ్డి, జాయింట్ సెక్రెటరీ రమేశ్‌రెడ్డి, మధు, కార్యవర్గ సభ్యులు పల్లెం రాజలింగు, కృష్ణ, నారాయణ, కోచ్ నరేందర్, రూబీ, అకాడమీ బాధ్యుడు నరసింహస్వామి పాల్గొన్నారు.

'మహిళలకు రక్షణ కల్పించడంలో విఫలం'

పాతమంచిర్యాల: మహిళలపై హింసను అరికట్టడంలో, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఏ.మహేశ్వరి విమర్శించారు. శనివారం జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్ట్ భవన్‌లో జిల్లా విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న హింసను అరికట్టడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని అన్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో మహిళలు, బాలికలపై అఘాయిత్యాలు జరుగుతున్నాయని తెలిపారు. జిల్లా కమిటీ నాయకుల ఎన్నిక నిర్వహించారు. సంఘం నాయకురాళ్లు దాసరి రాజేశ్వరి, పోతు విజయ, సంకె రజిత, శ్రావణి, నాగజ్యోతి, సమ్మక్క, రాజకుమారి, భవానీ, రేణుక, త్రివేణి, రమాదేవి, మదునక్క, సరిత పాల్గొన్నారు.

చేపమందుకు విశేష స్పందన



చేపమందు కోసం బారులు తీరిన జనం

దండేపల్లి: మృగశిరకార్తె ప్రవేశం సందర్భంగా అస్తమా, ఉబ్బసం వ్యాధిగ్రస్తులకు దండేపల్లి ప్రాథమిక పాఠశాల వద్ద గ్రామానికి చెందిన రంగసాయి ప్రేంసాగర్, భూలక్ష్మి దంపతులు శనివారం నిర్వహించిన ఉచిత చేపమందు పంపిణీకి విశేష స్పందన లభించింది. వ్యాధిగ్రస్తులకు ఉచితంగా చేపమందు వేశారు. గ్రామానికి చెందిన పలువురు వాలంటీర్లుగా సేవలందించారు. ఉమ్మడి ఆదిలాబాద్, కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి జనాలు భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక పోలీసులు క్యూపద్ధతిలో లోపలికి పంపించారు. పంపిణీ కేంద్రం ముందు రోడ్డుపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చూశారు. మందు కోసం ఒక రోజు ముందుగానే వచ్చి ఉన్నవారికి కొక్కిరాల రఘుపతిరావు ట్రస్టు ద్వారా ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు ఉచిత భోజన వసతి కల్పించారు.



చేపమందు వేస్తున్న ప్రేంసాగర్, భూలక్ష్మి

ఏరియా ఆస్పత్రి మూసివేత మానుకోవాలి



ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ శ్రేణులు

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని సింగరేణి ఏరియా ఆస్పత్రి మూసివేతకు గుట్టుగా చేస్తున్న కుట్రలను మానుకోవాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏరియా ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆస్పత్రిలో 250 పడకలు ఉండగా.. వాటి సంఖ్యను 70కి కుదించి నిర్వీర్యం చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. సిబ్బందిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేస్తున్నారని, ఉద్యోగ విరమణ సిబ్బంది స్థానంలో కొత్తగా నియామకాలు ఎందుకు చేపట్టడం లేదో యాజమాన్యం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. వ్యూహాత్మకంగా వార్డులను కుదిస్తూ క్యాజువాలిటీలో చికిత్స చేసి ఇన్‌పేషంట్లుగా ఉంచడం గర్హనీయమని అన్నారు. తాజాగా మూసివేతకు గురైన మేల్, ఫిమేల్, ఆర్థో, గైనిక్ వార్డులను పునః ప్రారంభించి ఆసుపత్రి అభివృద్ధికి తక్షణ చర్యలు తీసుకోవాలని, సిబ్బంది నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ ఉపాధ్యక్షుడు ఎం.వెంకటస్వామి, బెల్లంపల్లి, గోలేటి బ్రాంచ్‌ల ఇంచార్జి చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి బ్రాంచ్ సెక్రెటరీ దాగం మల్లేష్, నాయకులు డీఆర్.శ్రీధర్, అక్కెపల్లి బాపు, ఆడేపు రాజమౌళి, స్వామి దాసు, కే.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య


నాగేశ్(ఫైల్)

భీమిని: కన్నెపల్లి మండలం జజ్జరవెల్లి పంచాయతీలో వడుగూరి నాగేశ్ (30) ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాలు.. నాగేశ్ అదే గ్రామానికి చెందిన విజయతో ఆరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. ఇద్దరి మధ్య ఇటీవల గొడవలు జరగడంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. తిరిగి రావడం లేదని మనస్తాపం చెందాడు. శనివారం ఉదయం ఇంట్లో ఉరేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే బెల్లంపల్లి ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య విజయ, ఇద్దరు కుమారులు ఉన్నారు. తండ్రి రఘురాం ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి ఆత్మహత్య

వాంకిడి: కడుపునొప్పి భరించలేక యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై సాగర్ కథనం ప్రకారం.. మండలంలోని కనర్గాం గ్రామానికి చెందిన జాడి కమలాకర్‌కు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు కల్యాణ్ (20) ఉన్నారు. కల్యాణ్ జిల్లా కేంద్రంలో బైక్ మెకానిక్ గ్యారేజ్ నడుపుతుండేవాడు. కొన్ని నెలలుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో మద్యానికి బానిసయ్యాడు. ప్రతీరోజు మద్యం తాగి ఇంటికి వస్తుండటంతో కుటుంబీకులు మందలించారు. శుక్రవారం మధ్యాహ్నం ఆసిఫాబాద్‌లో కంప్యూటర్ కోర్సు నేర్చుకుంటున్న చెల్లెని బైక్‌పై ఇంటికి తీసుకువచ్చాడు. ఆ తర్వాత పెరట్లో మద్యం తాగాడు. మత్తులో అక్కడే ఉన్న పురుగుల మందు తాగాడు. కొద్దిసేపటికి అరుపులు వినిపించడంతో కుటుంబీకులు, ఇరుగుపొరుగు అక్కడికి చేరుకున్నారు. అతన్ని కారులో కాగజ్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. శుక్రవారం రాత్రి మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచి శనివారం ఉదయం శవపరీక్ష నిర్వహించారు. తండ్రి కమలాకర్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చంద్రబాబును కలిసిన నగేశ్


చంద్రబాబుతో ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబును శనివారం ఢిల్లీలో ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏపీలో అసెంబ్లీ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం పట్ల ఆయనకు ఎంపీ అభినందనలు తెలిపారు. ఎంపీగా ఎన్నిక కావడం పట్ల నగేశ్‌కు చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీ బండి సంజయ్ ఉన్నారు.

జీవన భారం..ఉపాధి ప్రశ్నార్థకం!

- ప్రత్యామ్నాయం లేక అవసోపాలు
- చేతినిండా పనిలేక బీడీ కార్మికుల ఇక్కట్లు


బీడీలు చుడుతున్న మహిళా కార్మికులు (ఫైల్)

నిర్మల్‌ఖిల్లా: రేయింబవళ్లు చెమటోడ్చి రెక్కలు ముక్కలు చేసుకుని బీడీలు చుట్టే కార్మికుల కష్టం అంతాఇంతకాదు. ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా కుటుంబ పోషణ భారం మోసే మహిళలు చాలామంది ఉన్నారు. ఈ రంగంపై ఆధారపడిన వారికి ప్రస్తుతం ఉపాధి కరువు అవుతోంది. బీడీల తయారీని జీవనాధారంగా మార్చుకున్న ఎంతోమంది ప్రత్యామ్నాయం లేక అపసోపాలు పడుతున్నారు. ఎన్నో ఏళ్లగా వెతలు అనుభవిస్తున్న కార్మికులు బతుకు బండి లాగేందుకు అష్ట కష్టాలు పడుతున్నారు. తమ కష్టాలు తీర్చి గట్టెక్కిస్తామని చెబుతున్న అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు తమకు నమ్మకం కలిగించలేకపోతున్నారు. ఆకు(తునికి)ను ప్రత్యేక నమూనాలో కత్తిరించి, పొడి తంబాకును అందులో వేసి ఒపిగ్గా మడిచి దాని చుట్టూ దారం కడితే అప్పుడు బీడీ తయారవుతుంది. ఇలా చెమటోడ్చి శ్రమించే ఎంతోమంది కార్మికులు చేతినిండా పని లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఈ ప్రాంతంలో బీడీ పరిశ్రమ..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 1.20 లక్షల మందికి పైగా బీడీ కార్మికులు ఉన్నారు. నిర్మల్, మంచిర్యాల, ఆదిలాబాద్ ప్రాంతాల్లో బీడీ పరిశ్రమ విస్తరించి ఉంది. పేద, మధ్య తరగతి కుటుంబాల మహిళలు బీడీ చుడుతూ ఉపాధి పొందుతున్నారు. బీడీలకు బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ తగ్గిపోవడంతో తగినంత పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కుటుంబ పోషణ భారంగా మారింది. మరోవైపు కార్మిక సంక్షేమ బోర్డు ద్వారా పథకాల ప్రయోజనాలు పొందడం లేదని వాపోతున్నారు. నిబంధనల ప్రకారం ప్రతీనెలలో 26 రోజులు కనీసం పని దినాలు కల్పించాల్సి ఉన్నా, ప్రస్తుతం 15 రోజులు మించి పనులు ఉండడం లేదు. ప్రతీఒక్కరికి రోజుకు వెయ్యి బీడీలకు సరిపడా ఆకు, తంబాకు అందించాల్సి ఉన్నా కంపెనీల యాజమాన్యాలు పూర్తిస్థాయిలో ఉపాధి కల్పించలేకపోతున్నాయి.

ఉమ్మడి జిల్లాలో..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో శివాజీ దేశాయి చారుబాయ్ తదితర కంపెనీలు 40 వరకు ఉన్నాయి. వీటి పరిధిలో దాదాపు 13 బ్రాంచ్‌లు పనిచేస్తున్నాయి. 1.20 లక్షలమంది కార్మికులు ప్రస్తుతం బీడీలు చుడుతున్నారు. వీరిలో సుమారు 75 వేల మందికి పీఎఫ్ ఉండగా, మిగతా వారికి ఈ సౌకర్యం లేదు.

- గతంలో పదేళ్లు పనిచేస్తే 50 ఏళ్లు నిండిన తర్వాత పింఛన్ అమలయ్యేది. ప్రస్తుతం 3,365 రోజులు పనిచేస్తేనే పింఛన్ అందేలా జీవో సవరించారు.

సమస్యలు పరిష్కరిస్తే మేలు..

- బీడీ రంగంపై జీఎస్టీ వస్తుసేవల పన్ను భారంగా మారింది. వెంటనే మినహాయింపు ఇవ్వాలి.
- కార్మికుల పింఛన్ రూ.వెయ్యి వరకు ఉంది. ప్రతినెల రూ.5వేల పింఛన్ అమలు చేయాలని డిమాండ్ ఉంది.
- ఈఎస్ఐ వర్తింపజేయడంతోపాటు మెరుగైన వైద్యం అందించేలా జిల్లా కేంద్రాల్లో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలి. కుటుంబానికి ప్రత్యేక ఆరోగ్య బీమా కల్పించాలి.
- బీడీ కంపెనీల యాజమాన్యాలు నాసిరకం ముడి సరుకులు సరఫరా చేయకుండా, నాణ్యంగా అందించాలి.
- ప్రస్తుతం వెయ్యి బీడీలకు రూ.245.8 మాత్రమే కూలి ఇస్తున్నారు. దాన్ని రూ. 500 ఇవ్వాలి. ప్రతినెలలో కనీసం 24 రోజులు పని దినాలు కల్పించాలి.

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత


నిందితులు, పట్టుకున్న నకిలీ పత్తి విత్తనాలతో పోలీసులు, టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మండలంలోని ముల్కల్ల శివారులో ఇద్దరు నిందితులు బైక్‌పై తరలిస్తున్న నకిలీ పత్తి విత్తనాలను టాస్క్‌ఫోర్స్ సీఐ సంజయ్, ఎస్సై లచ్చన్న శనివారం పట్టుకున్నారు. వారి కథనం ప్రకారం.. ఇద్దరు నిందితులు జగిత్యాల జిల్లా కోరుట్ల నుంచి మంచిర్యాల వైపు బైక్‌పై రెండు బ్యాగులతో వస్తున్నారు. పక్కా సమాచారంతో తనిఖీ చేయగా రూ.1.80 లక్షల విలువ గల 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలను గుర్తించారు. ఇద్దరు నిందితులను అదుపులో తీసుకుని విచారించగా కాసిపేట మండలం తుంగగూడెంకు చెందిన గుండవేణి రాజశేఖర్, ధర్మారావుపేటకు చెందిన ముచ్చెర్ల సంపత్‌గా గుర్తించారు. జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన షాబుద్దీన్ నుంచి తక్కువ ధరకు నకిలీ పత్తివిత్తనాలు కొనుగోలు చేసి జిల్లా పరిధిలోని అమాయక రైతులకు అమ్మేందుకు తీసుకువస్తున్నట్లు తెలిపారు. వారి నుంచి బైక్, 60 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకుని హాజీపూర్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ తెలిపారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న దేవి భూమయ్య తదితరులు

కాసిపేట: సింగరేణి యాజమాన్యం కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ మందమర్రి ఏరియా ఉపాధ్యక్షుడు దేవి భూమయ్య డిమాండ్ చేశారు. శనివారం మందమర్రి ఏరియా కాసిపేట–2 గనిలో కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు పుల్లూరి లక్ష్మణ్‌తో కలిసి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గనిపై షెడ్లు లేక విలువైన వస్తువులు ఎండకు ఎండి, వానకు నాని పనికి రాకుండా అవుతున్నాయన్నారు. కనీసం వెల్డర్స్ పనిచేసే చోట సరైన షెడ్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గని మేనేజర్‌తో మాట్లాడగా సమస్య పరిష్కారానికి కృషిచేస్తామన్నారు. ఐఎన్‌టీయూసీ చీఫ్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ రాంశెట్టి నరేందర్, ఏరియా సెక్రెటరీ దొరిశెట్టి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి కారుకూరి తిరుపతి, ప్రదీప్, గాలి పరమేశ్వర్, తొంగల కుమార్, చింతం రవికిరణ్, సమ్మిరెడ్డి శంకర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పొక్లెయిన్ దగ్ధం


దగ్ధమైన పొక్లెయిన్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఇచ్చోడ: మండలంలోని బావోజీపేట్ అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పొక్లెయిన్ దగ్ధమైంది. వివరాలు ఇలా ఉన్నాయి.. టైగర్‌జోన్ అటవీ సిబ్బంది ఆధ్వర్యంలో బావోజీపేట్ అటవీ పరిధిలో రెండు రోజులుగా కందకాలు(బౌండ్రీ ట్రెంచ్) తవ్వుతున్నారు. అక్కడ పోడు రైతులకు అటవీశాఖ సిబ్బంది మధ్య వివాదం నడుస్తోంది. శుక్రవారం ఉదయం సిబ్బంది కందకాలు తవ్వుతుండగా రైతులు పెద్దఎత్తున అక్కడికి చేరుకున్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. విషయం తెలుసుకున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, కాంగ్రెస్ నాయకురాలు ఆత్రం సుగుణ అక్కడికెళ్లి పోడు రైతులకు ఇబ్బంది పెట్టవద్దని అధికారులకు సూచించారు. కాగా, రాత్రి సమయంలో పొక్లెయిన్‌కు నిప్పు పెట్టడంతో అటవీశాఖ, పోడు రైతుల మధ్య వివాదం మరింత జటిలమైంది. ఈ ఘటనపై టైగర్‌జోన్ ఎఫ్ఆర్వో గణేశ్ శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

చోరీలకు పాల్పడుతున్న నిందితుడి అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ అశోక్‌కుమార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల, జగిత్యాల జిల్లాల్లోని పలు మండలాల్లో వరుస చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని అరెస్టు చేసినట్లు మంచిర్యాల డీసీపీ అశోక్‌కుమార్ తెలిపారు. శనివారం మంచిర్యాల డీసీపీ కార్యాలయంలో ఈ మేరకు వివరాలు వెల్లడించారు. జిల్లాలోని హాజీపూర్, లక్సెట్టిపేట, జగిత్యాల జిల్లాలోని మండలాల్లో తాళం వేసిన ఇళ్లలో నిందితుడి రాత్రి చోరీలకు పాలప్డేవారు. వరుస చోరీలపై ఫిర్యాదులు, నిందితులను పట్టుకునేందుకు మంచిర్యాల ఏసీపీ ప్రకాశ్ పర్యవేక్షణలో మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్సై గోపతి సురేశ్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా రెండు బృందాలు గాలింపు చేపట్టారు. హాజీపూర్ మండలం గుడిపేట శివారులో ఎల్లంపల్లి ప్రాజెక్టుకు వెళ్లేదారిలో ఇద్దరు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులో తీసుకుని విచారించగా ఖమ్మం జిల్లా మధిర మండలం ఆత్కూర్ గ్రామానికి చెందిన ఖంభంపాటి యేసోబు అలియాస్ అంగదుల సరేశ్‌రెడ్డి కాగా, ఆరు నెలలుగా పలుచోట్ల చోరీలు చేసినట్లు అంగీకరించారు. బంగారు ఆభరణాలను ఆదిలాబాద్ జిల్లా సోనార్‌కాలనీలో నివాసం ఉంటున్న మమ్మద్వార్ రాహుల్‌కు విక్రయించినట్లు తెలిసింది. వీరి ఇరువురిని అదుపులో తీసుకుని వారి నుంచి రెండున్నర తులాల బంగారం, 15 తులాల వెండి పట్టీలు, రూ. 2,44,660లను స్వాధీనం చేసుకుని రిమాండ్ చేసినట్లు డీసీపీ తెలిపారు.

సీఎంతో ముఖాముఖికి ఎంపికైన విద్యార్థిని


యశస్విని

చెన్నూర్: వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్ రవీంద్రభారతిలో విద్యాశాఖ నిర్వహించే సీఎం రేవంత్‌రెడ్డితో ముఖాముఖి కార్యక్రమానికి చెన్నూర్ జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని యశస్విని ఎంపికైనట్లు హెచ్ఎం కొమ్మెర రాధాకృష్ణమూర్తి తెలిపారు. పది ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ఆమె ఎంపికవడం, ముఖాముఖి అనంతరం విద్యార్థులతోపాటు తల్లిదండ్రులు, హెచ్ఎంలను సన్మానిస్తారని పేర్కొన్నారు. 10న హైదరాబాద్‌లోని హరిహర కళాభవన్‌లో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శితోపాటు రాష్ట్ర అధికారులు, హెచ్ఎంలు, తల్లిదండ్రులను సత్కరించి, విద్యార్థులకు వందేమాతరం విద్యాదావ పురస్కారాలు అందిస్తారని పేర్కొన్నారు. యశస్విని మండల విద్యాధికారితోపాటు పట్టణ ప్రముఖులు అభినందించారు.

అందుబాటులో పాస్‌పోర్టు సేవలు

- పోస్టాఫీసుల్లో ఏర్పాటు
- తత్కాల్‌లో దరఖాస్తు చేస్తే వారంలో పాస్‌పోర్టు


మంచిర్యాలలో పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్రం

పాతమంచిర్యాల: విదేశాలకు వెళ్లేవారికి పాస్‌పోర్టు తప్పనిసరిగా ఉండాలి. ఇక నుంచి కేంద్రప్రభుత్వం తపాలాశాఖ ద్వారా వీటి జారీని చేపట్టింది. జిల్లా కేంద్రంలో 2019 సెప్టెంబర్‌లో మినిస్ట్రీ ఆఫ్ ఎక్స్‌టర్నల్, భారత తపాలాశాఖ సంయుక్తంగా, పోస్టాఫీస్ పాస్‌పోర్టు సేవా కేంద్ర్ పేరుతో పాస్‌పోర్టు సేవా కేంద్రాలు (పీవోపీఎస్‌కే) ప్రారంభించింది. దేశవ్యాప్తంగా హెడ్ పోస్టాఫీస్‌లు ఎక్కడ ఉన్నాయో ఆయా ప్రాంతాల్లో ఇవి ఏర్పాటయ్యాయి. దీంతో పీవోపీఎస్‌కేలు ఏర్పాటుతో సమయం డబ్బు ఆదా అవుతున్నాయని దరఖాస్తుదారులు అంటున్నారు. పాస్‌పోర్టు వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకుని స్లాట్ బుకింగ్ చేసుకుని నిర్ణీత తేదీలో పీవోపీఎస్‌కేలో సంబంధిత డాక్యుమెంట్‌లు ఇవ్వాల్సి ఉంటుంది. విదేశాల్లో చదువులు, ఉద్యోగాల కోసం ఈసీఎన్ఆర్, పనుల కోసం వెళ్లేవారు ఈసీఆర్ పాస్‌పోర్టులు జారీ అవుతున్నాయి. జిల్లా కేంద్రంలోని పాస్‌పోర్టు కార్యాలయంలో ప్రతీ రోజు 40 మంది దరఖాస్తులు చేసుకుంటున్నారని ఆ వివరాలను పోలీస్ విచారణ అనంతరం మూడు వారాలకే పాస్‌పోర్టు చేతికందుతుందని అధికారులు తెలిపారు. తత్కాల్ పద్ధతిలో దరఖాస్తు చేసుకుంటే వారం తర్వాత పాస్‌పోర్టు పొందవచ్చన్నారు. పాస్‌పోర్టు జారీ అయిన తర్వాత పోస్టల్ సిబ్బందే దరఖాస్తుదారుని ఇంటి అడ్రస్ ప్రకారం బట్వాడ చేయాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు అందుబాటులో లేకపోతే కుటుంబసభ్యులకు ఇవ్వరు.

సేవలు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కేంద్రంలో పాస్‌పోర్టు సేవా కేంద్రం ఏర్పాటుతో చుట్టుపక్కల ప్రజలు పాస్‌పోర్టు కోసం దరఖాస్తులు చేసుకుంటున్నారు. గతం కంటే ప్రస్తుతం పాస్‌పోర్టు పొందే వారికి దూరభారం తప్పింది. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా దరఖాస్తుదారులే కార్యాలయానికి వచ్చి నిర్ణీత ఫీజు చెల్లించి పాస్‌పోర్టు పొందవచ్చన్నారు. సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– ఆర్.రామారావు, పోస్టల్ సూపరింటెండెంట్ (ఇన్‌చార్జి) మంచిర్యాల

దరఖాస్తు తేదీ పొడిగింపు

శ్రీరాంపూర్: సింగరేణిలో మార్చి 15, 2024న ఉద్యోగాల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తుల స్వీకరణ తేదీని పొడిగించినట్లు జీఎం(పర్సనల్) బీఆర్ దీక్షితులు ఓ ప్రకటనలో తెలిపారు. ముందుగా నిర్ణయించిన ప్రకారం గతనెల 15 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించాల్సి ఉండగా సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడిందని పేర్కొన్నారు. తిరిగి ఈనెల 10 నుంచి 29న సాయంత్రం 5 వరకు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని తెలియజేశారు.

11న పాత వాహనాల వేలం

మంచిర్యాలక్రైం: ఎక్సైజ్ పరిధిలో పట్టుబడిన వాహనాలకు మంచిర్యాల ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌లో ఈనెల 11న వేలం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ గురువయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వేలంలో పాల్గొనేవారు 50 శాతం ఈఎండీ రూపంలో చెల్లించాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు మంచిర్యాల ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని సూచించారు.

ఇసుక లారీ పట్టివేత


పోలీసులు పట్టుకున్న ఇసుక లారీ

జైపూర్: మండలంలోని వేలాల గోదావరి నది నుంచి అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని జైపూర్ పోలీసులు శనివారం పట్టుకున్నారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసుల తనిఖీల్లో లారీ పట్టుబడినట్లు ఎస్సై శ్రీధర్ తెలిపారు. ఈ లారీని పోలీస్ స్టేషన్ తరలించారు. అనుమతి లేకుండా రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై హెచ్చరించారు.

పదోన్నతులకు ముందే జిల్లాలకు కేటాయించాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ముందే 317 జీవో బాధితులను స్థానిక జిల్లాలకు కేటాయించాలని జీవో 317 బాధితుల సంఘం రాష్ట్ర గౌరవఅధ్యక్షుడు దూడ రాజనర్సుబాబు కోరారు. శని వారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ స్థానికత ఆధారంగా 317 జీవో బాధితులను గుర్తించి పంపిస్తే సుమారు రాష్ట్రంలో 20 వేల మంది వారి స్థానిక జిల్లాకు వెళ్లే అస్కారం ఉందన్నారు. ఆతర్వాతే బదిలీలు ప్రమోషన్లు ఇచ్చినట్లయితే సమన్యాయం ఉంటుందని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, 317 జీవో సబ్‌కమిటీ సభ్యులు మానవనీయ కోణంలో ఆలోచించి బాధితులను ఆదుకోవాలని కోరారు.

సీఎంపీఎఫ్ చీటీలు ఇవ్వాలి

శ్రీరాంపూర్: గడిచిన ఆర్థిక సంవత్సరంలో కార్మికులకు ఇవ్వాల్సిన సీఎంపీఎఫ్ చీటీలు వెంటనే ఇవ్వాలని టీబీజీకేఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఇన్‌చార్జి పెట్టం లక్ష్మణ్, మాజీ ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, నాయకులు బండి రమేశ్, పానుగంటి సత్తయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. చీటీలు పంపిణీ చేయకపోవడంతో కార్మికులకు తమ ఖాతాలో ఎన్ని డబ్బులు జమ అయినా తెలియక ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. వెంటనే సీఎంపీఎఫ్ శాఖ అధికారులతో కంపెనీ అధికారులు చర్చించి చీటీలు పంపిణీ చేయాలని కోరారు. అంతేకాకుండా కార్మికుల ఇన్‌కమ్ ట్యాక్స్ ఫైలింగ్‌ను అన్ని గనులు, డిపార్టుమెంట్లపై సిబ్బందితో యాజమాన్యమే చేయించాలన్నారు. కంపెనీ గత ఆర్థిక సంవత్సరం సాధించిన వార్షిక లాభాల నుంచి కార్మికులకు 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేశారు.



ఆత్మీయ సమ్మేళనం

పట్టణంలోని సింగరేణి హైస్కూల్‌కు చెందిన 1998–99 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం పాఠశాలలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకుని సిల్వర్ జూబ్లీ వేడుకలు జరుపుకొన్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనం తర్వాత చిన్ననాటి మధుర స్మృతులను జ్ఞాపకం చేసుకున్నారు. రోజంతా ఉత్సాహంగా గడిపారు. అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. – రామకృష్ణాపూర్

పార్కింగ్ పరేషాన్


నస్పూర్ కాలనీ షిర్కేలో మెయిన్ రోడ్డుపై పార్క్ చేసిన కార్లు

- కంపెనీ క్వార్టర్లలో స్థలం కరువు
- మెయిన్ రోడ్లపైనే వాహనాలు
- ఇబ్బంది పడుతున్న కార్మికులు

శ్రీరాంపూర్: సింగరేణి కాలనీల్లో కార్మికులు తమ కార్లు పార్కింగ్ చేసుకోవడానికి స్థలం దొరకడం లేదు. గతంతో పోల్చితే కార్మికుల వేతనాలు పెరగడం, జీవన విధానం మెరుగుపడడంతో కార్ల వినియోగం అనూహ్యంగా పెరిగింది. కార్లు కొంటున్నా పార్కింగ్ స్థలం లేక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. సింగరేణిలో అత్యధిక మంది ఉద్యోగులు పని చేస్తున్న శ్రీరాంపూర్ ఏరియాలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. శ్రీరాంపూర్ కాలనీ, నస్పూర్ కాలనీ, షిర్కే కాలనీ, నాగార్జున కాలనీ తదితర కాలనీల్లో పార్కింగ్ సమస్య రోజు రోజుకు తీవ్రమవుతోంది. చాలా ఏళ్ల క్రితం కట్టిన ఈ క్వార్టర్లు సింగిల్ బెడ్‌రూం నిర్మాణాలు. ఇందులో నివాసానికి ఇబ్బందిగా మారడంతో ఇంటి ముందు ఉన్న కొద్ది ఖాళీ స్థలాల్లో షెడ్డు నిర్మించుకుని అందులో మోటారుసైకిళ్లు పెట్టుకోవడం, మరికొంత మంది వెయిటింగ్ రూంగా వినియోగించుకుంటున్నారు. పశువులు, పందులు ఇంట్లోకి రాకుండా ఉండడం కోసం మరికొందరు కాంపౌండ్ వాల్స్ నిర్మించుకున్నారు. చాలా ఏళ్ల క్రితమే ఈ నిర్మాణాలు జరిగాయి. రోజురోజుకు కార్ల సంఖ్య పెరగడంతో ఇంటి ముందు ఉన్న రోడ్డుపై పార్క్ చేస్తున్నారు. దీంతో మరో కారు, ఆటో వస్తే వెళ్లడానికి స్థలం ఉండడం లేదు. ఇరుగుపొరుగు వారి నుంచి అభ్యంతరాలు రావడంతో విధి వెలుపల ఉండే మెయిన్ రోడ్ల పక్కన పార్కింగ్ చేసుకోవాల్సి వస్తోంది. ఇలా అన్ని కాలనీల్లో మెయిన్ రోడ్ల పక్కన కారు పార్కింగ్‌తో ఆ రోడ్డు సైతం ట్రాఫిక్‌కు ఇబ్బందిగా మారుతున్నాయి. కాలనీల మధ్య అక్కడక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయి. వీటి చుట్టూ రక్షణ గోడలు, ఫెన్సింగ్ ఏర్పాటు చేసి భద్రత కల్పిస్తే కాలనీ వాసులు కార్లు అక్కడే పార్కింగ్ చేసుకునే వీలుంటుంది. వాహనాలకు రక్షణ ఉంటుందని కార్మికులు పేర్కొంటున్నారు. కంపెనీ అధికారులు స్పందించి పార్కింగ్ ప్లేస్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కారుకు దూరం..

చాలామంది కార్మికులు కారు కొనుక్కొనే స్థోమత, కోరిక ఉన్నా పార్కింగ్ సమస్యతో కొనుగోలు చేయడం లేదు. కొత్త కారు కొని పార్కింగ్ లేక మెయిన్ రోడ్డుపై ఎండ, వానలో ఉంచడం కంటే కొనుక్కోకుండా ఉండడమే నయమనే భావన నెలకొంది. రోడ్లపై కారు పార్కింగ్ చేసిన సందర్భాల్లో ఆకతాయిలు, తాగుబోతులు రాత్రివేళ కార్ల అద్దాలు పగులగొడుతున్నారు. ఇలా చాలా కార్లు ధ్వంసం అయ్యాయి.

ఇబ్బంది అవుతోంది..

క్వార్టర్ ముందు కారు పెట్టుకుందామంటే స్థలం లేదు. రోడ్డుపై పెడుతామంటే రోడ్డు జామ్ అవుతుంది. చేసేది లేక మెయిన్ రోడ్డుపై కారు పెడుతున్నా. సెక్యూరిటీ ఉండదు. కంపెనీ ప్రత్యేకంగా కాలనీల మధ్య గల ఖాళీస్థలాల్లో కార్ పార్కింగ్ స్థలం ఏర్పాటు చేయాలి.

– కే.రామారావు, హెచ్ఓఎం

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం


కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి రవి

చెన్నూర్: లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమవుతాయని స్థానిక సివిల్ జడ్జి పర్వతపు రవి అన్నారు. చెన్నూర్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీమార్గంతో సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. చెన్నూర్ కోర్టు పరిధిలో 630 కేసులు పరిష్కారమయ్యాయని తెలిపారు. వివిధ కేసుల్లో రూ.4.62 లక్షలు, బ్యాంక్ సంబంధిత కేసుల్లో రూ.2.71 లక్షల జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఏపీవో ప్రేమలత, ఏజీపీ రాంబాబు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేశ్‌చందర్‌గిల్డా, పోలీసు అధికారులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. వీక్లీ పేమెంట్స్ 3500/- మీ పేరు, అడ్రస్ కాల్/ వాట్సప్ చేయగలరు. 95028 15217 [M-1185206]

■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం : 18K. Ph : 9160900024, 9640400073 [H-799887]

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర।। 9391912949, 040-40123376. [H-800412]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462